కామెడీ కథ

ఎస్.కె.సన్ని

# అయోమయం - అద్దింటి పాట్లు

అయోమయం వుస్సూరుమంటూ నడుస్తున్నాడు. ఇల్లు దగ్గరపడేకొద్దీ గుండెల్లో దిగులు పుట్టుకొస్తోంది. ఇంటికెళ్ళగానే తన భార్యామణి మళ్ళీ సొద మొదలుపెడుతుంది. అయోమయం స్కూల్లో ఓ టీచరు. స్కూల్లో బెత్తం చూపించి పిల్లల్ని బెదిరిస్తాడే కానీ, ఇంట్లో మాత్రం భార్య చూపుడువేలు చూపిస్తేనే బెదిరిపోతాడు. భార్య మాటకి ఏనాడైనా అడ్డంగా వాదించాడో ప్లగ్‌లో వేలుపెడతాననో, బావిలో దూకుతాననో బెదిరిస్తుంది. చివరికి చేసేదేం లేక అన్నింటికి గంగిరెద్దులా తలాడిస్తూ ఈ స్థితికి వచ్చేశాడు సదరు అయోమయం.

అయోమయానికి పెద్ద ఆస్తిపాస్తులు లేకపోయినా తాతముత్తాతలనాటి ఓ ఇల్లు వుంది. చూడటానికి భూత్ బంగ్లాలా వున్నా, వేసవికాలంలో చల్లగా, వానాకాలంలో వెచ్చగా నీళ్ళు కరువయినప్పుడు బావితోపాటు, అన్ని సౌకర్యాలు వున్నాయి. కానీ వారం రోజుల నుండి భార్య కామాక్షి వలన ఓ సమస్య వచ్చి పడింది అయోమయానికి.

వారం రోజుల క్రిందట కామాక్షి తన పిన్ని కూతురింటికి గృహప్రవేశానికి వెళ్ళి వచ్చింది. అప్పటి నుండి మొదలయింది పోరు..వాళ్ళిల్లు ఎంతో అందంగా వుందని, సెపరేట్ బెడ్‌రూమ్, చక్కని షోకేసులతో, క్రింద మార్బుల్స్ పరిచి, అన్ని హంగులతో చూడముచ్చటగా వుందని, వుంటే మనం అలాంటి ఇంట్లోనే వుండాలంటూ పట్టు పట్టి కూర్చుంది. "అదెలా కుదురుతుంది?" అని అయోమయం అంటే, "ఎందుకు కుదరదు? మనం ఈ ఇల్లు అద్దెకు ఇచ్చేసి, ఓ చక్కటి అద్దె ఇల్లు చూసుకొని అందులో చేరిపోతేసరి" అంటూ తేలికగా ఓ చెత్త సలహా పారేసింది.

అనవసరపు ఖర్చు అని, అయోమయం వద్దని ఎంత వాదించినా లాభంలేకపోయింది. వినే రకం కాదని చివరకు సరేనని బలవంతంగా ఒప్పుకున్నాడు. అప్పటి నుండి అద్దె ఇళ్ళ వేటలో పడ్డాడు. చాలావరకు చూసినా ఏవీ నచ్చలేదు అయోమయానికి. తిరిగి, తిరిగి విసుగొచ్చేటట్టుంది. చివరకు "ఏమిటి సార్ సొంతిల్లు పెట్టుకొని, అద్దె ఇంటికోసం వెతుకుతున్నారు" అంటూ జనమంతా తనని ఓ వెర్రి వెంగళప్ప కింద చేర్చి మాట్లాడుతున్నారు.

ఇంట్లోకి అడుగుపెడితే చాలు 'ఇల్లు దొరికిందా' అంటూ తన చెవిన ఇల్లు కట్టుకొని మరీ నసపెడుతుంది కామాక్షి. ఇల్లు దగ్గరపడటంతో ఆలోచనల నుండి బయటికొచ్చాడు. స్వేచ్ఛగా బయట తిరిగి బోనులో ప్రవేశించే ఎలుకలా వుంది నా పరిస్థితి అనుకుంటూ ఇంట్లోకి అడుగుపెట్టాడు.

కామాక్షి తన భారీ శరీరాన్ని భారంగా మోస్తూ, పళ్ళన్నీ బయట పెట్టి నవ్వుతూ "ఏమయింది వెళ్ళిన పని" ఎదురొస్తూ అడిగింది.

"నా పిండాకూడు అయింది" కోపంగా అన్నాడు.

అసలే ఇళ్ళకోసం తిరిగి తిరిగి అలసి ఇంటికి రాగానే కనీసం ఓ కప్పు కాఫీ అయినా ఇవ్వకుండా గుమ్మంలోనే నిలదీసినట్లు అడిగేసరికి చిర్రెత్తుకొచ్చింది అయోమయానికి. అంతే భర్తని కళ్ళతోనే కాళికాదేవిలా ఒక్క ఉరుము ఉరిమింది. నోట్లోంచి మాటలు బయటపడ్డాయి అయోమయానికి. "అది కాదు కాముడు, గాలి దుమారం వీధిలో, ఇప్పుడే ఒక ఇల్లు చూసి వస్తున్నాను. నువ్వు చెప్పినట్టు ఇల్లు అన్ని హంగులతో చక్కగా చూడముచ్చటగా వుంది. కాకపోతే నాలుగవ అంతస్థులో వుంది" అంటూ టూత్‌పేస్టు యాడ్‌లోలా పళ్ళికిలించాడు.

"అయితే ఇంకేం? రేపే మనిల్లు ఖాళీ చేసేసి అందులో చేరిపోదాం" ఉత్సాహంగా అంది.

"ఏమిటి చేరిపోయేది? స్కూలుకి కూరగాయలకి పాలకి... ఇలా రోజుకి నాలుగుసార్లు ఎక్కి దిగేసరికి నలభై రోజులు బ్రతకాల్సిన వాడిని, నాలుగు రోజులకే గుటుక్కుమంటాను. అసలే బక్కప్రాణిని" కోపాన్ని దిగమింగుకుంటూ అన్నాడు.

"అయితే మరెలా?"

"ఏంటి నే చస్తేనా? ఫర్వాలేదులే నీకు పెన్షన్ వస్తుంది. హాయిగా బ్రతకొచ్చు. నేను పైకెళ్ళి మరింత హాయిగా వుంటాను"

"మీకంత వేళాకోళంగా వుందా? ఇంటి గురించి మాట్లాడకుండా? జరగని వాటి గురించి మాట్లాడుతున్నారు" కసురుకుంది.

"కాముడు మనింటికేం తక్కువ? పాతదనే కాని, అన్ని సదుపాయాలూ వున్నాయి. పిల్లలకు నాకు స్కూళ్ళకి దగ్గర అదే అద్దిల్లు అయితే ఎంత దూరంలో దొరుకుతుందో? అదీకాక అద్దె నెలకు నాలుగు వేలైనా పెట్టాలి. అదే డబ్బు దాచితే, వాళ్ళ చదువులకు ఉపయోగపడుతుంది. కాస్త ఆలోచించు" భార్యను స్థిమితి పరిచే ఉద్దేశ్యంతో అన్నాడు.

"ఏమిటి మళ్ళీ మొదటికొచ్చారు? నేను వీధిలో అందరికీ చెప్పేశాను. మనం తొందర్లోనే ఇల్లు ఖాళీ చేయబోతున్నామని, ఎవరైనా చేరే పనయితే చెప్పమనీను. అన్నట్టు, మొన్నటికి మొన్న ఏమయిందో తెలుసా? ఓ నలుగురు మనుషులు వచ్చి 'అమ్మా మేము ఓ హారర్ టి.వి. సీరియల్ తీయబోతున్నాము, అందుకోసం ఓ నాలుగు రోజులపాటు మీ ఇల్లు అద్దెకు ఇస్తారా అంటూ అడిగారు. నాకు తలకొట్టేసినంత పనయింది. అందుకే నలుగురులో మనం నవ్వులపాలు కాకుండా ఓ మంచి ఇల్లు చూసుకొని చేరిపోదాము. మీకు ఇళ్ళు వెతకటం కష్టమయితే నేనో అయిడియా చెబుతాను"

"ఏంటది?" విసుగ్గా అన్నాడు.

"మా పెద్దమ్మ కొడుకు లేడూ..." ఏదో చెప్పబోయింది. మధ్యలోనే అయోమయం అడ్డుతగులుతూ-

"ఎవరూ? ఇంట్లో ఎవరూ లేనప్పుడు పనిమనిషిని అల్లరి చేస్తే అది లాగి లెంపకాయకొట్టి, ఈడ్చి వీధిలోకి లాక్కెళ్ళినప్పుడు వీధిలో అంతా గలాటా అయిందే అతని గురించా?" అంటూ ఇంకా ఏదో చెప్పబోయి భార్య వంక చూశాడు. భార్య గుడ్లురిమి పిల్లలు వింటున్నారు అంటూ సైగ చేసేసరికి నోరు మూసేశాడు.

"వాడికి ఎవడో ఇళ్ళబ్రోకరు తెలుసట, ఫోన్ చేసి అడ్రస్ కనుక్కుంటాను. ఒకసారి అతని దగ్గరకు వెళ్ళిరండి. మీకు ఏ శ్రమా వుండదు. ఎంత తొందరగా ఇల్లు దొరికితే అంత తొందరగా ఈ దిక్కుమాలిన కొంప ఖాళీ చెయ్యొచ్చు" విసురుగా అంది.

తన తాత ముత్తాతల నాటి ఇంటిని దిక్కుమాలిన కొంప అనగానే సర్రున కోపమొచ్చింది అయోమయానికి.

"అంతేనా నీ మాట నీదేనా?" కోపంగా అడిగాడు.

"అంతేమరి" ఖచ్చితంగా అంది.

"నేను కుదరదు అంటే?" కాస్త ధైర్యం కూడదీసుకొని అన్నాడు. అక్కడే వున్న ప్లగ్గు వంక, తన వేలి వంక కళ్ళతో మార్చి మార్చి చూపించింది అందులో పెట్టేస్తానంటూ.

"ఖర్మరా భగవంతుడా? ఏం రొంపిలోకి దించావయ్యా" అంటూ నెత్తిన చెయ్యి పెట్టుకొని కూర్చుండిపోయాడు.

○○○

మరుసటిరోజు అడ్రస్ కనుక్కొని వెళ్ళాడు.

అదేదో గోడౌన్‌లా వుంది. తలుపుమీద కొడుతూ "ఎవరండీ లోపల" నీరసంగా పిలిచాడు. కొంతసేప టికి ఓ నల్లటి తుమ్మమొద్దులాంటి ఓ వ్యక్తి వచ్చి "ఎవరు కావాలి?" నొసలు చిట్లిస్తూ అడిగాడు.

"ఇక్కడ ఇళ్ళ బ్రోకరు ఎవరో వున్నారట" నసు గుతూ నిలబడ్డాడు.

"ఏంది బే మా భైరవన్నను బ్రోకరు, గ్రీకరు అని పేలుతుండావు? చమ్డాలు తీస్తాను బిడ్డా" కర్కశంగా అన్నాడు.

"నాకు అద్దెకు ఇల్లు కావాలి. అన్నను కలవాలి" అతడి తీరుకు భయపడిపోతూ అన్నాడు.

"సరే పదా" అంటూ అయోమయాన్ని లోప లకు తీసుకుపోయాడు. లోపలంతా చీకటిగా వుంది. గొంతు వినపడుతోంది. ఆకారం కని పించడం లేదు. కళ్ళు నులుముకొని చూశాడు. చీకట్లోనే కలిసి పోయేటట్లు నల్లటి రంగులో ఓ భారీ విగ్రహం కూర్చుని వుంది. అతని కళ్ళు జీరో క్యాండిల్ బల్బుల్లాగా వున్నాయి. అతన్ని చూడగానే వణుకు మొదలయింది అయోమ యానికి. ఇతను అద్దెకు ఇల్లు చూపించేవాడా? లేక సమాధికి దారి చూపించేవాడా? భగ వంతుడా ఏమిటి నాకీ పరీక్ష?

"ఎవర్ని మర్డర్ చేయాలి?" అతని గొంతు వింటూనే ఉలి క్కిపడ్డాడు.


"అదీ..నాకు.. అద్దెకు..ఇల్లు" తడబడుతూ అన్నాడు.

"అద్దెకు ఇల్లు కావాలా?" శిధి లావస్థలో వున్న ఇల్లు ఫెళాఫెళా మంటూ విరిగిపడుతున్నట్టుగా నవ్వాడు.

"అవును" అతని నవ్వుకు బెదిరిపోతూ అన్నాడు.

"మాకు మర్డర్ల గిరాకి ఎక్కు వగా వుంది. రెండు రోజుల్లో కనపడు ఇల్లు చూసిపె డతా..అన్నట్టు నా కమీషన్ రెండు వేలు. ఇల్లు చూపించగానే, స్పాట్ పేమెంట్‌గా ఇచ్చేయాలి. నఖ రాలు చేశావో శాల్తీ గల్లంతు అయిపోద్ది" వేలుతో బెదిరిస్తూ అన్నాడు.

సరేనంటూ వెనుతిరిగాడు. 'నా భార్యలాగే వీడూ నన్ను వేలు చూపించి బెదిరిస్తున్నాడు. అసలు నా అడ్రస్, అద్దె ఎంతలో కావాలో, ఎలాంటి ఇల్లు కావాలో వివరాలేమీ అడగలేదే? పోనీ నేనే చెబితే? వద్దులే? మళ్ళీ అతని ఉగ్రరూపం ఏ విధంగా చూడాల్సివస్తుందో' అనుకుంటూ మెల్లిగా జారుకున్నాడు. బయటికి వచ్చి హాయిగా వూపిరి పీల్చుకున్నాడు.



○○○

రెండు రోజుల తరువాత కామాక్షి పోరుపడలేక భైరవన్న దగ్గరకు వెళ్ళాడు. అయోమయాన్ని చూస్తూనే "ఆ తమ్ముడూ.. నీకు ఓ మంచి ఇల్లు చూసి పెట్టాను. మా అన్న వుండే వీధిలోనే వుందా ఇల్లు. తొందర్లో ఖాళీ అవుతుందట. వెళ్ళిచేరిపో" ఏ కళనున్నాడో నవ్వుతూ అన్నాడు.

అతని నవ్వు చూడగానే అయోమయా నికి నవ్వుమీదే విరక్తిపుట్టింది.

"నేను మా అన్న దగ్గరికే వెళుతున్నాను. నీకు ఇల్లు చూపించినట్టు వుంటుంది పదా" అంటూ తన బైక్ స్టార్ట్ చేసి, 'ఎక్కు' అన్నట్టు సైగ చేశాడు.

అయోమయం అయోమయంగా చూస్తూ ఎక్కాలా? వద్దా? అన్నట్టు బిక్కమొహం వేశాడు.

"ఎక్కవయ్యా బాబు" అంటూ తొందరచేశాడు.

భయంగా ఒక్క ఉదుటున ఎక్కి కూర్చున్నాడు. ఏనుగు వెనకాల నక్కిన ఎలుకపిల్లలా వుంది అయోమయం పరిస్థితి.

"దబ్బులు తీసుకు వచ్చావు కదా" అడిగాడు బండి పోనిస్తూ.

'నీ సంగతి తెలిసి కూడా తీసుకు రాకుండా వుంటానా బాబూ..' అనుకుంటూ- "తెచ్చాను" అన్నాడు.

"ఇప్పుడు నువ్వు చూడబోయే ఇల్లు అన్ని సౌకర్యాలున్నయ్. ఏం ఆలోచించకుండా చేరిపో? ఇంటి ఓనరు ఎవరో పనికిమాలిన సన్నాసిలా వున్నాడు. సొంత ఇల్లు అద్దెకు ఇచ్చేసి, అద్దె ఇంట్లో దిగుతాడట తలతిక్క వెధవ" ఇంకా ఏవో అతనికొచ్చిన కొత్త కొత్త బూతులు తిడుతున్నాడు.

'అంటే నా బాపతేనన్నమాట; పాపం అతని భార్య అతన్ని ఎన్ని తిప్పలు పెట్టిందో..ఈ నిర్ణయం తీసుకున్నాడు. నేను మాత్రం ఒకందుకు సంతోషించాలి. నా భార్య ఇల్లు మొత్తం పడగొట్టించి రీమోడల్ చేయిద్దాం అని మంకుపట్టు పట్టి కూర్చుంటే అన్ని లక్షలు ఎక్కడి నుండి తేను. కామాక్షికి ఈ అయిడియా రానందుకు మనసులో సంతోషించాడు. ఈ ఇల్లయినా బాగుంటే త్వరగా చేరిపోవచ్చు. రోజూ తన భార్య సణుగుడు తప్పుతుంది' అనుకుంటూ అటూ, ఇటూ చూస్తూ ఆశ్చర్యపోయాడు. అది అయోమయం వుండే ఏరియా.

'ఇది మా ఏరియాలాగుందే? ఇక్కడ ఇళ్లేవి ఖాళీగా లేవే? నేను అన్నీ విచారించానే?' మనసులో ప్రశ్నల వర్షం కురిపించుకుంటూ "సార్ ఈ ఏరియాలో ఇళ్ళు ఎక్కడా ఖాళీగా లేవండీ" ఆతృతగా చెప్పాడు.

"నోరు మెదపకుండా కూర్చుంటావా? ఇళ్ళ సంగతి నాకు తెలుసా? నీకు తెలుసా?" కసిరాడు.

అయోమయం కిమ్మనకుండా చూస్తున్నాడు. "ఏ ఇల్లు అయివుంటుందబ్బా?" అనుకుంటూ గుడ్లప్పగించి చూస్తుండగానే నేరుగా తమ ఇంటి ముందుకొచ్చి ఆగింది బైక్.

"దిగు ఇదే ఇల్లు" అంటూ చూపించాడు.

నోరు వెళ్ళబట్టి తమ ఇంటి వైపు చూస్తుండిపోయాడు.

"ఏంటి అలా నోరు వెళ్ళబెట్టుకొని చూస్తున్నావు. ఈగలు దూరుతాయి నోరుముయ్యి. ముందు నా కమీషన్ ఇచ్చి లోపలకు వెళ్ళి ఇల్లు చూసి ఎప్పుడు దిగాలో నిర్ణయించుకో" దబాయించినట్టు అన్నాడు.

"అదే..ఈ ఇల్లు" అతని మాట పూర్తికాకుండానే...


"ఏంటి చూడటానికి దయ్యాల కొంపలా వుందనా? చక్కగా కాపురం ఉండవచ్చు" మరో మాటకు అవకాశం ఇవ్వకుండా చెయ్యి ముందుకు చాపుతూ "ముందు డబ్బు తీయ్" కొట్టినట్టు అడిగాడు.

'హు..తన ఇంటిని తనకే చూపించి దబాయించి కమీషన్ వసూలు చేస్తున్నాడంటే వీడు సామాన్యుడు కాడు' మనసులో తిట్టుకుంటూ అన్నాడు.

"ఏంటి గొణుగుతున్నావు" తీక్షణంగా చూస్తూ దగ్గరకొచ్చాడు.

వీడితో పెట్టుకుంటే నేను చచ్చి రేపటికి రెండవ రోజు అవుతుంది. ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ చప్పున జేబులోంచి రెండువేలు తీసి ఇచ్చాడు. విసురుగా లాక్కున్నట్టు తీసుకొని బైక్ మీద గున్నఏనుగులా వెళ్ళిపోయాడు.

అయోమయానికి ఏడ్వాలో నవ్వాలో తెలియటం లేదు. ఇదంతా తన భార్య వల్లే



వచ్చింది. త్వరలో ఇల్లు ఖాళీ చేసేస్తామంటూ వీధి వీధంతా టమ్కుకొట్టింది కాక, ఇళ్ళ బ్రోకరు అంటూ ఈ తలకు మాసినవాడి అడ్రస్ ఇచ్చి చచ్చింది. కనీసం నా అడ్రస్, వివరాలు అడగాలని తెలీని ఈ తింగరోడికి, ఎందుకు ఈ బ్రోకర్ పని, మనలాంటి వాళ్ళని పీక్కుతింటానికి కాకపోతే? భార్యమీద పీకలదాకా కోపం వచ్చింది అయోమయానికి.

ఆ కోపాన్ని అలాగే కంటిన్యూ చేస్తూ లోపలికి వెళ్ళాడు. ప్రేమగా ఎదురొచ్చిన కామాక్షి "ఏవండి ఇక నుండి మీకు అద్దె ఇంటి బాధ తప్పిందండి. ఇక మీరు ఏ ఇల్లూ చూడక్కర్లేదు" నవ్వుతూ అంది.

'యురేకా' అని అరవాలనిపించి తమాయించుకున్నాడు. తన భార్యకు ఇంత మంచి బుద్ధి ఇచ్చిన ఆ భగవంతుడికి మనుసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. రెండు వేలు పోతే పోయాయి. ఇంటికి రాగానే భార్య నోటి నుండి పాలకోవాలాంటి వార్త విన్నాను. రేపటి నుండి ఇళ్ళకోసం ఎవడి కాళ్ళు, ఎవడి పీక పట్టుకోనవసరం లేదు. ఆనందంగా గెంతాలనిపించింది.

"ఎన్ని రోజులకు నా బాధ అర్థం చేసుకున్నావు కాముడు, నీలాంటి భార్య దొరకటం ఈ జన్మకు నేను చేసుకున్న అదృష్టం" భారీ డైలాగులు వల్లించాడు.

"ఆగండాగండి పూర్తిగా చెప్పకుండా అలా ఉబ్బితబ్బిబ్బవుతారేంటి? మనకు సొంతిల్లు వుండగా మరొకరి ఇంట్లో అద్దెకుండాల్సిన అవసరం మనకేంటి?"

"కదా" సాగదీశాడు.

"అందుకే ఈ పాత ఇల్లు పడగొట్టించేసి రీమోడల్ చేయించాలనే ఆలోచన తట్టింది. రేపటి నుండి ఆ పనిలో వుండండి" ఖరాఖండిగా చెప్పేసింది.

అంతే... నెత్తిన పెద్దబండరాయి పడినట్టు నేలకొరిగిపోయాడు భార్యాబాధితుడైన అయోమయం.

○

## పాపం రాణి!

రెండేళ్ల క్రితం షిరిడీలో సంపత్ మోరె అనే ఆసామీ దగ్గర భూమిని కొన్న రాణీ ముఖర్జీ అది ప్రభుత్వ భూమి కావడంతో కోర్టులో కేసయింది. ఇటీవలే దానికి సంబంధించిన తీర్పు వచ్చింది. దాని ప్రకారం ఆ భూమి ప్రభుత్వానికే చెందుతుందని, రాణీకి ఎలాంటి హక్కూ లేదని తేలింది. సరిగ్గా డాక్యుమెంట్లను పరిశీలించకుండానే షిరిడీలో ఇల్లు కట్టుకుందామనే ఆశతో స్థలాన్ని కొన్న రాణీ ముఖర్జీ ఇప్పుడా లాండ్‌తోపాటు డబ్బుల్నీ పోగొట్టుకోవలసి వచ్చిందిట.